పోషణ వాటిక.. ఆరోగ్యం భళా

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికల ఏర్పాటు
- ఆకుకూరల పెంపకానికి ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు
- ఎన్టీఆర్ జిల్లాలో 440 అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపిక

పెనుగంచిప్రోలు/కంచికచర్ల : ఎటువంటి రసాయనాలు వాడని ఆహార ఉత్పత్తులను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పసిబిడ్డలకు అందించడం ద్వారా వారికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పోషణ వాటిక పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పెరటి తోటల పెంపకానికి శ్రీకారం చుట్టింది. వీటి ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి రూ.10 వేల చొప్పున మంజూరు చేస్తోంది. ఈ డబ్బుతో ఆకుకూరలు, కాయగూరల సాగుకు అనువైన మట్టి తోలించడం, విత్తనాలు చల్లుకోవడం వంటి వాటిని వినియోగించాలని సూచించింది.


కొణకంచిలోని కిచెన్ గార్డెన్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, చిన్నారులు



మున్నలూరు అంగనవాడీ కేంద్రంలోని కిచెన్ గార్డెన్

326 కేంద్రాల్లో తోటల సాగు..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 1475 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సొంత భవనాలు, కూరగాయల సాగుకు అనుకూలంగా స్థలం ఉన్న 440 కేంద్రాలను పోషణ వాటిక అమలుకు ఎంపిక చేశారు. ఎంపికైన కేంద్రాలకు ఒక్కొక్క దానికి రూ.10 వేలు చొప్పున మంజూరు చేశారు. ప్రస్తుతం 326 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలు, కూరగాయల తోటల సాగు మొదలైంది. మిగిలిన కేంద్రాల్లోనూ వారం రోజుల్లో తోట పనులు మొదలవుతాయని అధికారులు తెలిపారు.

నాణ్యమైన ఉత్పత్తులే లక్ష్యం ..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించాలని తోటల పెంపకం చేపట్టారని అంగన్‌వాడీ అధికారులు చెబుతున్నారు. ఈ తోటల్లో ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ పద్ధతుల్లో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్తహీనత రాకుండా అన్ని రకాల ఆకుకూరలు పండించి వాటిని అంగన్‌వాడీ కేంద్రంలో వండి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తామన్నారు. ఈ తోటల వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు కొనే భారం కూడా తప్పుతుందని సూచిస్తున్నారు.

పండించిన వాటితోనే వంటలు



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో గోంగూర, బచ్చలకూర, తోటకూర, పాలకూర వంటి ఆకుకూరలతో పాటు కూరగాయలు కూడా పండిస్తున్నాం. పెరటి కూరల పెంపకానికి ఒక్కో కేంద్రానికి రూ.10 వేల చొప్పున ఇచ్చారు. వాటితో మట్టి తెచ్చుకుని విత్తనాలు నాటాం. ఇక్కడ పండిన ఆకుకూరలతో వంట చేసి పెడుతున్నాం.

– గుంటుపల్లి ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, ముండ్లపాడు

రక్తహీనత నివారణకు..



పౌష్టికాహారం అందక పిల్లలు, తల్లులకు రక్తహీనత వస్తుంది. దీని నివారణకు కేంద్రాల్లోనే ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా ఆకుకూరలు సాగు చేసేందుకు పోష ణ వాటికలు ఏర్పాటు చేస్తున్నాం. క్యాన్సర్ నివారణలో కూడా నాణ్యమైన ఉత్పత్తులు ఉపయోగపడతాయి. శాశ్వత భవనాలు ఉండి సొంత స్థలాలు ఉన్న కేంద్రాల్లో ఈ తోటల పెంపకం చేపట్టాం.

పి.లక్ష్మీభార్గవి, సీడీపీఓ, చిల్లకల్లు

తక్కువ ఖర్చుతో పోషకాహారం..



తక్కువ ఖర్చుతో సేంద్రీయ ఆకుకూరలు, కూరగాయలతో వండిన ఆహారాన్ని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ఇవ్వడానికి వీలు కలుగుతుంది. ఈ ఆహారంతో వీరందరికీ ఎక్కువ పోషకాలు అందుతాయి. వర్షాకాలం వాటిని పెంచడానికి వాతావరణం అనుకూలంగా ఉంటుంది. అంగనవాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఆకుకూరలు, కాయకూరలు పెంచేలా తగిన చర్యలు చేపడుతున్నాం..

వి. భాగ్యరేణుక, సీడీపీఓ, నందిగామ

క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి కౌన్సిల్ సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

4న మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : మండల పరిషత్ సమావేశాన్ని ఈనెల నాలుగోతేదీ శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అన్ని గ్రామాల సర్పంచులు హాజరుకావాలన్నారు. అధికారులు ఆయాశాఖలకు సంబంధించిన నివేదికలతో సమావేశానికి విధిగా హాజరుకావాలని, లేనిపక్షంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

మిక్ విద్యార్థికి గోల్డ్‌మెడల్



కంచికచర్ల: తమ విద్యార్థులకు సాంకేతిక విద్యనందించడంతోపాటు పలు క్రీడల్లోనూ శిక్షణనిస్తున్నామని డీవీఆర్ అండ్ డాక్టర్ హిమశేఖర్ మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్ అన్నారు. మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన సెకండియర్ విద్యార్థి పి.వివేక్‌ను సోమవారం కళాశాలలో అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 74కేజీల విభాగంలో వివేక్ గోల్డ్‌మెడల్ సాధించారని తెలిపారు. విజేత వివేక్‌ను అభినందించినవారిలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సుహాస్, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శౌరయ్య, ఏపీడీ ఎస్.సురేష్, హనుమంతరావు, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఆలయానికి రూ.3.75 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆయా హక్కు వేలం ద్వారా రూ.3.75లక్షల ఆదాయం వచ్చిందని ఈవో సురేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కాఫీ హోటల్, కూల్‌డ్రింక్స్, చిత్ర పటాలు అమ్ముకునే లైసెన్స్ హక్కులకు సోమవారం వేలం నిర్వహించారు. హోటల్ నడుపుకునే హక్కుకు నల్లబండగూడెంకు చెందిన ఉపేంద్ర రూ.3.75లక్షలకు కై వసం చేసుకున్నట్లు చెప్పారు. కూల్‌డ్రింక్స్, చిత్ర పటాలు అమ్ముకునే హక్కులను పొందేందుకు పాటదారులు ఆసక్తిచూపకపోవడంతో వాయిదా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు : ఎస్‌ఐ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): నూతన సంవత్సర వేడుకల నిర్వహణలో నిబందనలు పాటించాలని ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ సోమవారం సూచించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం రాత్రి వేడుకలు జరుపుకునేవారు తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. అర్ధరాత్రి డీజేలు, తదితర కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందని మద్యం తాగి, అధిక ధ్వనితో వాహనాలు నడిపేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజేతకు అభినందన

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో 44వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంఫియన్ షిప్ పోటీల్లో వత్సవాయి గ్రామానికి చెందిన కురుగుంట్ల జ్యోతిరెడ్డి రన్నింగ్ 100 మీటర్లు, 200 మీటర్లు, 5 కి.మీ వాకింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. ఫిబ్రవరి నెలలో రాజస్థాన్‌లో జరగనున్న నేషనల్ మీట్‌కు ఎంపికైంది. అథ్లెట్ జ్యోతిని ఎమ్మెల్యే తాతయ్య తన నివాసంలో సోమవారం అభినందించారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు : ఆర్డీఓ



నందిగామటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ సంబంధింత సమస్యల పరిష్కారం కోరుతూ రెండు, పౌరసరఫరాల శాఖకు ఒకటి, సర్వే డిపార్ట్‌మెంట్‌కు రెండు, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అర్జీలను ఆయా డిపార్ట్‌మెంట్లకు పంపించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

పెండింగ్ వేతనాల విడుదలకు డిమాండ్


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల

వీరులపాడు: ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల డిమాండ్ చేశారు. మండలంలోని జుజ్జూరులో సోమవారం నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ఐదునెలలుగా సక్రమంగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీలలోని పారిశుద్ధ్య సిబ్బందికి సైతం ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కారణాలతో వీవోఏలను విధుల నుంచి తొలగించడం తగదన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను మార్చుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య ముసుగులో కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన వారిని కాపాడుతున్నారని ఆరోపించారు. కేంద్రానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బమ్మ, శేఖర్, అహ్మద్ గౌస్, పుల్లమ్మ, శాయమ్మ, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై ఫిర్యాదు



జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండలంలోని గౌరవరంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రధాన సెంటరు, ఎస్సీకాలనీలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, ఆదూరి సురేష్, మందడపు జగదీష్, సతీష్, సుధీర్, నాగుల్ ఆయా ఫ్లెక్సీలను రిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు పక్కనే ఉన్న టీడీపీ ఫ్లెక్సీలను కదిలించకుండా వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను ధ్వంసం చేశారన్నారు. ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి బాధ్యులను గుర్తించడంతోపాటు వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి

ఎంపీడీఓకు ఫిర్యాదు


ఎంపీడీఓ విజయలక్ష్మీకి వినతిపత్రం అందజేస్తున్న ఉదయ్‌కిరణ్ తదితరులు

కంచికచర్ల: కొంతమంది వ్యక్తులు సిండికేట్‌గా మారి మండల పరిషత్ కాంప్లెక్స్‌లోని షాపులకు మూడు దశాబ్దాలుగా అతితక్కువ అద్దె చెల్లిస్తూ ప్రభుత్వాదాయానికి గండికొడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ అన్నారు. అద్దెకు షాపులను తీసుకున్న వ్యక్తుల్లో కొందరు ఇతరులకు తిరిగి అద్దెకు ఇస్తూ అధికమొత్తంలో ఆదాయం పొందుతూ, ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మికి సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ మండల పరిషత్ కాంప్లెక్స్‌లోని షాపులకు అద్దెదారులు నెలకు కేవలం రూ.1700నుంచి రూ.2వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఇదే షాపింగ్‌కాంప్లెక్స్ పక్కనున్న ప్రైవేట్ వ్యక్తులకు చెందిన షాపుల అద్దె రూ.10వేల నుంచి రూ.20వరకు ఉన్న విషయాన్ని అధికారులు గమనించాలన్నారు. ఒకేసామాజికవర్గానికి చెందిన వ్యక్తులు మూడు దశాబ్దాలుగా ఈ షాపులను కైవసం చేసుకుంటున్నారని, బహిరంగ వేలం నిర్వహించడం ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతకు ఈ షాపులు దక్కేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకెళ్లినా, ఎటువంటి స్పందన లేదని తెలిపారు. త్వరలో జరుగనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలపై చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలని, అన్నివర్గాల వారికి షాపులు దక్కేలా చూడాలని ఎంపీపీ మలక్‌బషీర్, ఎంపీడీఓ విజయలక్ష్మీలకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో సీడీపీఓ లక్ష్మీభార్గవి, ఎంపీడీవో శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది

పెనుగంచిప్రోలు:కిశోర బాలలకు యోగ, ధ్యానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, ఎంపీడీవో జి శ్రీను సూచించారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం కిశోరి వికాసం కార్యక్రమంపై అంగన్‌వాడీలు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు శిక్షణనిచ్చారు. అనంతరం కిశోర బాలల్లో సంపూర్ణ ఆరోగ్యం ప్రాధాన్యాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లింగ వివక్షత చూపించకూడదన్నారు. అంతకుముందు శిక్షణలో భాగంగా సంపూర్ణ ఆరోగ్యం, నైపుణ్య అభివృద్ధి, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, నాణ్యమైన విద్య మొదలైన 10 అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్ వినియోగించుకునే విధానాన్ని లీగల్ సలహాదారులు రాధిక వివరించారు. ఆయుర్వేద వైద్యాధికారి వై రత్నప్రియదర్శిని మాట్లాడుతూ యోగాతో లాభాలు, ధ్యానం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.రవీంద్ర, ఎన్జీవో రామకృష్ణ, టాటాట్రస్టు ప్రతినిధి మాధురి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశవర్కర్లు, మహిళా సంరక్షణా కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌కు ముమ్మర ఏర్పాట్లు



న్యూఇయర్‌కు సిద్ధం చేసిన కేక్‌లు

జగ్గయ్యపేట: నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో కేక్‌లు, పండ్లు, బొకేలు, పువ్వులకు మంచి డిమాండ్ ఏర్పడింది. రకరకాల డిజైన్లతో బొకేలు తయారు చేయించి ఆత్మీయులకు అందజేసేందుకు పలువురు సమాయత్తమవుతున్నారు. భారీసంఖ్యలో కేక్‌ల ఆర్డర్ ఉంటుండటంతో ఆయా బేకరీల నిర్వాహకులు కేక్‌ల తయారీలో బిజీబిజీగా గడుపుతున్నారు. వివిధ ఆకారాల్లో సృజనాత్మకతకు పదును పెట్టి కేకులు తయారు చేస్తున్నారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా వారికి కావాల్సిన ఆకృతుల్లో కేకులను బేకరీ నిర్వాహకులు తయారుచేసి ఇస్తున్నారు. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు తదితర గ్రామాలలో బేకరీల్లో సుమారు వేల కేజీల్లో కేకుల ఆర్డర్‌లు అందినట్లు బేకరీల నిర్వాహకులు చెబుతున్నారు.

ఉద్యోగాలకు 13 మంది ఎంపిక

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో ఉన్న జగ్గయ్యపేట లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 28 మంది యువతీ యువకులు పాల్గొనగా ఎస్ఐఎస్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఒకరు, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఆరుగురు, కేఎల్ గ్రూప్ ఆరుగురిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తంగెళ్ల వెంకటేశ్వరరాజు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. కార్యక్రమం కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, అధ్యక్షులు జల్లా తిరుపతిరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, జాయింట్ సెక్రటరీ వీవీఎల్. నారాయణరావు, పాలకవర్గ సభ్యులు జూటూరి అబ్బులు, కొల్లా నాగరమేష్, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రామతులసి, అశోక్ పాల్గొన్నారు.

నందిగామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి

నందిగామ టౌన్: నందిగామ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి తెలిపారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 20వార్డుల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ చైర్మన్, కౌన్సిలర్ల సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అజెండాలోని 12అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, షేక్ ఖాలిక్, షేక్ యాకుబ్‌అలీ, బండారు గంగమ్మ, మందా మరియమ్మ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు తొమ్మిది అర్జీలు

మల్కాపురం(జగ్గయ్యపేట): మండలంలోని మల్కాపురం సచివాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ తొమ్మిది మంది రైతులు అర్జీలు అందజేశారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ వివరించారు. సర్వేయర్ అనూష్‌బాబు, ఆర్ఐ సూరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్:దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను సైతం రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని తహసీల్దార్ నూతక్కి సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం, అంబారుపేట గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ పలువురు రైతులు అర్జీలు అందజేశారని, ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, సర్వేయర్ బోధ్యానాయక్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సవరణ

అర్ధరాత్రి వేడుకలకు అనుమతుల్లేవు


పేట పట్టణ ఎస్ఐ రాజు

జగ్గయ్యపేట అర్బన్: 2025 నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ మంగళవారం రాత్రి నిర్వహించుకునే వేడుకల్లో ప్రజలు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని పట్టణ ఎస్ఐ జి.రాజు సూచించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మంగళవారం రాత్రి ప్రత్యేక పోలీసు ఆంక్షలు విధించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సహకరించాలని కోరారు. అర్ధరాత్రి రోడ్డు మీద వేడుకలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. రాత్రి 11 గంటల తరువాత రోడ్లపై హడావుడి చేస్తే చర్యలు తప్పవన్నారు. చిల్లకల్లు–జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై, గ్రామాల్లోని సీసీ రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా చేరి న్యూఇయర్ కేకులు కోయడం, అల్లరి చేయడం, కేకలు వేస్తూ వాహనాలపై తిరగడం చేయరాదన్నారు. అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు లోబడి నతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

జగ్గయ్యపేట: పెన్షన్‌దారులు జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి నెలఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని జగ్గయ్యపేట సబ్‌ట్రెజరీ అధికారి ప్రఫుల్లకుమార్ కోరారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షన్‌దారులు సర్టిఫికెట్‌ను డిజిటల్ పద్ధతిలో జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా తీసుకోవాల్సి ఉంటుందన్నారు.ఈసర్టిఫికెట్ కోసం ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, పీపీవో నంబరు, బ్యాంకు ఖాతాను ఎస్టీవో, మీసేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



చిల్లకల్లు(జగ్గయ్యపేట): విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం(బెంగుళూరు) వారి సహకారంతో స్థానిక మండల వనరుల కేంద్రంలో సోమవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. యా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 చిట్టిబాబు మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు సైన్స్ ప్రదర్శన నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుదానంద్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన మాతి తిరుపతిరావు (35) పొలం వద్ద ఆదివారం ఉదయం సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.